500) లలిత

ప॥ చిరకాలధర్మ్మములు చివుకు దవ్వగబోతే। హరిమఱుగు చొచ్చితి మాతడే రక్షించెను॥

చ॥ భువి దొల్లి లేరా పుణ్యముసేసినవారు। జవళిశాస్త్రములెల్లా జదివినవారు లేరా।
దివి కెక్కి దేవతలై తేరినవారు లేరా। యివల నే మివిసేసి యెవ్వరి బోలేము॥

చ॥ తగ దొల్లి వినమా తపముసేసినవారి। జిగి నన్నియజ్ఞములు సేసినవారి వినమా।
మిగులా సిద్ధివడసి మించినవారి వినమా। యెగువ నే మింతకంటే యెక్కుడు సేసేమా॥

చ॥ పెక్కుమతమ్ములు చూచి బెండుపడ్డవారు లేరా। పక్కన నన్నివిద్యలా బరగినవారు లేరా।
వొక్కడే శ్రీవేంకటేశు డుల్లములో నుండగాను। యెక్కుడితని గొలువ కెవ్వరి బోలేము॥